
# నవనారసింహక్షేత్రం
## అహోబిలం

### నమ్మాల్సిందేనండోయ్...

డా॥ సాయిఅయితిక

మీకు తెలుసో తెలియదో మన రాష్ట్రంలో ఉన్న దివ్యక్షేత్రాలు చాలావరకూ నారసింహ క్షేత్రాలే. అంటే సాక్షాత్ నారసింహుని అవతారాలతో అలరారిన క్షేత్రాలే. అప్పటికి వేంకటేశ్వర స్వామి అంతగా ప్రాచుర్యంలోకి రాలేదు. అంతెందుకూ తిరుమలకు కాలిబాటలో వెళితే మీకు దారిలో ఒక నారసింహుని దేవాలయం కనిపిస్తుంది. ఆ కాలంలో, అంటే దాదాపు రామానుజుల కాలం కన్నా ముందు, ఈ నరసింహుని దేవాలయం దాటి ఎవరూ ముందుకు వెళ్లేవారు కాదంటారు. ఆ విషయం మరోసారి చర్చిద్దాం. పురాణ ప్రసిద్ధిగాంచిన ఈ అహోబిలం అనేది ముఖ్యమైన పవిత్ర పుణ్యక్షేత్రం. అహోబిలం క్షేత్రాన్నే అహోబలం అని కూడా వ్యవహరిస్తారు. ఈ క్షేత్రాన్నే సింగవేలు తుండ్రం అనీ అంటారు. అహోబిలం సముద్రమట్టానికి 2800 అడుగుల ఎత్తులో ఉంది. ఇది ఆ కాలంలో వైష్ణవ భక్తులకు అతి ముఖ్యమైన క్షేత్రంగా ఉండేది. అన్నమయ్య "ఫాలనేత్రానల ప్రబలవిద్యుల్లతాకేళీ విహారా, లక్ష్మీనారసింహా!" అని కీర్తించాడు. అంతా ఆ నారసింహుని దయే అన్నాడు అన్నమయ్య. అదీ ఈ నారసింహుని క్షేత్ర మహిమ అనడానికిదో ఉదాహరణ మాత్రమే.

భక్త ప్రహ్లాదుని కథ మనందరికీ తెలుసు. హిరణ్యకశిపుని సంహరించి, తన భక్తుడైన ప్రహ్లాదుని రక్షించడం కోసం ఆ మహావిష్ణువు నారసింహుని రూపాన్ని ధరించాడు. ఎందుకంటే,



హిరణ్యకశిపుడు తనకు అటు మనిషి కాని, ఇటు జంతువు కాని వాని చేత అటు భూమ్మీద కూడా తనకు చావుండకూడదని వరాలు పొందాడు. అందుకే ఆ మహావిష్ణువు నరసింహుని రూపాన్ని దాల్చాడు. గడప మీద కూచున్నాడు. అటు ఉదయం, ఇటు రాత్రి కాని వేళ (అసుర సంధ్య వేళ) చంపేశాడు. అలా ఈ దివ్య తీర్థంలో స్వయంభువుగా వెలసిన దేవదేవుడు ఉగ్రనరసింహస్వామి. పరమ భాగవతుడైన ప్రహ్లాదుని రక్షించడం కోసం, హిరణ్యకశిపుణ్ని వధించడం కోసం హరి నరహరిగా ఆవిర్భవించాడు. ప్రహ్లాద వరదుడైన నరసింహుడి బలాన్ని, శక్తినీ దేవతలు ప్రశంసించడం వల్ల ఈ క్షేత్రం అహోబలమైంది. ఆ అవతార కథ సాగిన ప్రదేశమే ఈ అహోబలక్షేత్రం. ఈ భూమ్మీద ఉన్న నాలుగు దివ్యమైన నరసింహ క్షేత్రాలలో అహోబిల క్షేత్రం ఒకటి. రాక్షసుడైన హిరణ్యకశ్యపుని సంహరించడానికి తన భక్తుడైన ప్రహ్లాదుని రక్షించడానికి స్తంభంలో ఉద్భవించిన స్థలమే ఈ అహోబిలక్షేత్రం.



ఎగువ అహోబిలం నందు వేం చేసియున్న మూలవిరాట్‌ను ఉగ్రనరసింహస్వామి, అహోబిల, అహోబల నరసింహస్వామి, ఓబులేసుడు అని పిలుస్తారు. గరుడాద్రి, వేదాద్రి పర్వతాల మధ్యన ఈ ఎగువ అహోబిల ఆలయం ఉంది. శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠించిన లక్ష్మీ నరసింహస్వామి వేంచేసినదే దిగువ అహోబిలం.

తిరుమల, అహోబిలం, శ్రీశైలం స్వయం వ్యక్త క్షేత్రాలని ప్రసిద్ధి. ఈ అహోబల క్షేత్రం నల్లమల అడవులలో ఉంది. ఆదిశేషుడు పర్వతాకృతి పొందాడని పౌరాణికుల విశ్వాసం. ఈ పర్వత ప్రకృతి సౌందర్యానికి మురిసిపోయిన ఆదిశేషుడు వయ్యారంగా పవళించాడట. ఆ పడగలపై శ్రీనివాసుడు, నడుమ్మీద నారసింహుడు, తోకపై మల్లిఖార్జునుడు ఆవిర్భవించారట. వీరు నల్లమల మగసిరులుగా దానిని మలిచారని ఆస్తిక లోకం స్మరిస్తుంది.

ఎగువ మహోబలంలో ప్రహ్లాదుని తపస్సుకు మెచ్చి స్వయంభువుగా బిలంలో వెలిసాడు కాబట్టి అహోబిలం అని పిలుస్తారు. దిగువ అహోబలంలో వెలసిన ప్రహ్లాదవరదుని సన్నిధానం లక్ష్మీనరసింహస్వామి విశిష్ట అద్వైత కార్యకలాపాలకు కేంద్రం. దేశంలో ఎన్నో నారసింహ క్షేత్రాలుండగా, ఒక్క అహోబిలానికే ఎందుకంత ప్రాముఖ్యత అని అడగొచ్చు. నిజమే. నారసింహ క్షేత్రాలెన్నో మన రాష్ట్రంలోనే ఉన్నాయి. యాదగిరిగుట్ట మీద కూడా ఆ స్వామి వేంచే సి భక్తులను కాపాడుతున్నాడు. ఐతే, అహోబిల క్షేత్రం విశేషమేమిటంటే, ఆ నరహరి తన అవతారాన్ని భక్తుల కోసం ఇక్కడ తొమ్మిది ప్రదేశాలలో ప్రకటించాడు.

ఈ నవనారసింహుల పేర్లు ఇవీ – లక్ష్మీ నరసింహుడు లేదా ప్రహ్లాద నరసింహుడు, ఛత్రవాట నరసింహుడు, కందర నరసింహుడు, యోగానంద నరసింహుడు, గుహ నరసింహుడు, క్రోడ నరసింహుడు, మాలోల నరసింహుడు, జ్వాలా నరసింహుడు, పావన నరసింహుడు.

అందుకే దీనిని నవ నారసింహక్షేత్రం అని


కూడా అంటారు. అందువల్ల ఇక్కడ ఈ అహోబిల క్షేత్రంలో ఆ స్వామి దివ్యరూపాలను సంపూర్ణంగా దర్శించి సేవించుకునే భాగ్యం ఉంది. ఈ అహోబిలంలో ఎగువ అహోబిలం, దిగువ అహోబిలం అని రెండు దేవాలయాలున్నాయి.

నవనారసింహులలో దిగువ అహోబిలం పేర్కొనబడలేదు కాని ఈ ఆలయప్రాశస్తం అమోఘమైనది. ఇక్కడికి వచ్చిన భక్తులు ఎగువ దిగువ అహోబిల పుణ్యక్షేత్రాలను సందర్శించి తరిస్తారు. ఈ అహోబల క్షేత్రం కర్నూలు జిల్లాలోని నంద్యాల రైల్వేస్టేషన్‌కు 68 కిలోమీటర్ల దూరంలో, ఆళ్ళగడ్డకు 24 కిలోమీటర్ల దూరంలో ఉంది. అన్ని ప్రధాన క్షేత్రాల నుండి అహోబిలం చేరడానికి మార్గాలు, రవాణా సౌకర్యాలూ ఉన్నాయి. ఈ క్షేత్రం అహోబలంలో ప్రధానమైంది భవనాశిని నది. లక్ష్మీనరసింహుని పాదాలను కడిగే పాద్యంగా గగన గంగ భువికి దిగి వచ్చింది.

వేద ఘోషలతో దివ్యప్రబంధ సూక్తులతో అర్చకుల ఆరగింపులతో అహోబలం కోలాహలంగా ఉంటుంది. శ్రీ కార్యపరుల పరమ భక్తుల ఏకాంత భక్తికి అమృతవల్లీ సమేతుడైన నారసింహుడు పరవశించి, తనను సేవింపవచ్చిన వారికి వారు కోరకనే వరాలు అనుగ్రహిస్తాడు. ఇక్కడ ప్రహ్లాద వరదుడైన లక్ష్మీ సమేతుడు సుందరంగా శేషపీఠం మీద అవతరించాడు. అమృతవల్లి సన్నిధి, అండాల్ సన్నిధీ కూడా ఉన్నాయి. అలాగే ఇక్కడ వైష్ణవ ఆచార్యులకు, అళ్వారులకు ప్రత్యేక సన్నిధులున్నాయి.

శ్రీవేంకటేశ్వరుడు పద్మావతితో తన వివాహం జరిగే సమయంలో శ్రీ నరసింహస్వామిని దిగువ అహోబలంలో ప్రతిష్ఠించి ఆరాధించాడని, అందుకే దానికి గుర్తుగా ఇక్కడ దిగువ అహోబలంలో శ్రీవేంకటేశ్వరుని సన్నిధి, కళ్యాణ మంటపం ఉందనీ అంటారు. ప్రహ్లాద వరదుడు ఉభయ నాంచారులయిన శ్రీదేవి, భూదేవి విగ్రహాలు స్వర్ణ కవచాలతో మూలమూర్తులకు దివ్యాభిషేకాలతో, దివ్య ఆభరణాలతో నేత్రపర్వంగా





నిలిచింది. వైష్ణవ భక్తులు నిత్యం స్మరించే 108 దివ్య క్షేత్రాలలో (వైష్ణవ ఆళ్వారులు దర్శించి స్తుతించిన క్షేత్రాలను దివ్యక్షేత్రాలు అంటారు) ఈ క్షేత్రం ముఖ్యమైంది.

అహోబిలక్షేత్ర ప్రసిద్ధికి, అభివృద్ధికి పల్లవులు, చోళులు, విద్యానగరరాజులు, చాళుక్యులు, కాకతీయులు, విజయనగరరాజులు, రెడ్డిరాజులు – ఇలా ఎందరెందరో ఎన్నో సేవలందించారు. ఆ క్షేత్రాభివృద్ధికి, వికాసానికీ తోడ్పడ్డారు. అయితే 15వ శతాబ్దంలో తురుష్కుల దండయాత్రలో అన్ని దేవాలయాల్లాగానే ఈ అహోబిల క్షేత్రం కూడా పడి నలిగిపోయింది.

రంగరాయల ప్రభువు తురుష్కుల మీద విజయం సాధించి జీయరుగారికి అహోబిలక్షేత్రాన్ని అప్పగించి, జయానికి గుర్తుగా ఉన్నతోన్నతమైన జయస్తంభాన్ని దేవాలయ చివరి ప్రాకారంలో స్థాపించాడు. ఇప్పటికీ దానిని మనం చూడవచ్చు. పరమశివ భక్తుడైన ప్రతాపరుద్ర మహారాజు తన దినచర్య ప్రకారం ఒక రోజు శివలింగం పోత పోయగా అది నారసింహాకృతిని ధరించిందట. దాంతో మొదటి అహోబిల పీఠాధిపతికి ఆ విగ్రహాన్ని అప్పగించి, జీవితాంతం నరసింహుని సేవించి పూజించాడు. అన్నట్టు, ఈ క్షేత్రానికి నగరి, నిధి, తక్ష్యాద్రి, గరుడాద్రి, శింగవేళ్ కుండ్రం, ఎగువ తిరుపతి, పెద్ద అహోబిలం, భార్గవతీర్థం, నవనారసింహ క్షేత్రం అనే పేర్లు కూడా ఉన్నాయని పురాణాలు చెబుతున్నాయి.

తురుష్కుల దండయాత్రలో విచ్ఛిన్నమయిన అహోబల క్షేత్రం 43వ పీఠాధిపతి పంచసంస్కారాలతో 44వ పీఠాధిపతి ఆశీస్సులతో పూర్వ వైభవాన్ని సంతరించుకుంటూ వచ్చింది.

అహోబిల నృసింహుని సుప్రభాత సుందర

సేవలు, ఏకాంత సేవల వరకు సొగసులతో నిండి ఉంటాయి. నవరాత్రులలో, విశేష దినాలలో స్వామి వింత వెలుగులు విరజిమ్ముతూ దర్శనమిస్తాడు. విజయదశమి, సంక్రాంతి పార్వేట ఉత్సవాలలో స్థానికులు, చెంచుల విన్యాసాలు, విల్లంబుల ప్రయోగాలు నేటికీ నాటి గ్రామీణ వాతావరణానికి అద్దం పడతాయి.

అన్నట్టు ఈ అహోబల క్షేత్రం చుట్టూ ఎన్నో తీర్థాలున్నాయి. వాటిలో చాలా ముఖ్యమైంది రక్తకుండ తీర్థం. హిరణ్యకశిపుని సంహరించాక, తన గోళ్లకు అంటిన రక్తాన్ని కడిగిన తీర్థమే ఇది. అందుకే ఇది రక్తకుండ తీర్థం అని పేరు తెచుకుంది.

దిగువ అహోబిలం చేరుకుని, ప్రహ్లాదవరదుని సేవించుకొని ఇక్కడికి 8 కి.మీ దూరంలో ఉన్న ఎగువ అహోబిలంలోని గుహాంతర్భాగాన నిలిచిన అహోబల నృసింహుని అర్చించుకొని





భవనాశిని జలాలతో సేద తీర్చుకొని ఓర్పుతో క్రమంగా నవనారసింహ క్షేత్రాలను దర్శించుకొని ప్రహ్లాద గుడిలో బండ మీద నిలిచి భాగవత సుందర జ్ఞాపకాలను పొంది ఉగ్రస్తంభ ప్రదక్షిణలతో పునీతమై తీర్థయాత్రను ఫలవంతం చేసుకోవడానికి నేడు చక్కని అవకాశముంది. ప్రహ్లాద వరదుని లీలలను స్మరించుకోగానే హిరణ్యకశిపుని సంహార సంఘటనను మనకు గుర్తు చేస్తాడు.

*ఉగ్రం వీరం మహా విష్ణుం జ్వలంతం*
*సర్వతోముఖం*
*నృసింహమ్ భీషణం భద్రం మృత్యోర్మృత్యుం*
*నమామ్యహమ్*

లక్ష్మీనరసింహ నామ స్మరణమే మన మదిలోని కోరికలను తీర్చేస్తుంది. ఆ నామమహిమ అలాంటిది. అహోబిలం దర్శించండి. మీకే నిజం తెలుస్తుంది. అపుడు మీరే అంటారు నమ్మాల్సిందేనండోయ్ అని. ●